సాక్షి
చిత్తూరు
ఆదివారం । 25 । మే । 2025



ఇసుక ధరలకు రెక్కలు

ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్య నదిలో నీరు చేరడంతో మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. - 8లో



గజరాజుపై వేణుగోపాలుడు

కార్వేటినగరం బ్రహ్మోత్సవాలలో భాగంగా వేణుగోపాలస్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో శ్రీవారి దర్శనభాగ్యం లభిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో జెడ్పీ చైర్మన్

వి.కోట : వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఉమ్మడి చిత్తూరు జిల్లాల జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు తమ అధినేతకు వివరించారు. అలాగే తమ ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగించిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయనతో పాటు శాంతీపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, మండల నాయకులు కృష్ణమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి మావటీల శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్ : కుప్పం, పుంగనూరు, పలమనేరు రేంజ్ పరిధిలోని 30 మంది అటవీ సిబ్బందికి మావటీలుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవల జిల్లాకు కుంకీ ఏనుగులు వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 5 ఏనుగులు రాగా, ఇందులో ఒకటి తిరుపతి జిల్లాకు, నాలుగు చిత్తూరు జిల్లాకు కేటాయించారు. వీటితోపాటు గతంలో ఉన్న రెండు ఏనుగులు కలిపి మొత్తం 7 ఏనుగులు పలమనేరులోని ననియాలలో ఉన్నాయి. బెంగళూరు నుంచి కుంకీలతో పాటు జిల్లాకు వచ్చిన మావటీలు ఇక్కడ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇదివరకే జిల్లా నుంచి సిబ్బంది బెంగళూరుకు వెళ్లి శిక్షణ తీసుకున్నారు. కాగా ఇక్కడ సిబ్బందికి బెంగళూరుకు చెందిన మావటీల సమక్షంలో పలు మెలకువలు వారికి నేర్పనున్నారు. ఏదైనా సందేహాలుంటే క్షేత్రస్థాయిలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. నెలరోజుల పాటు వారికి మెలకువలు నేర్పించిన తరువాత కుంకీలను గజ దాడుల నివారణకు పంపనున్నట్లు తెలుస్తోంది.

ఎస్‌ఆర్పీలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సమగ్రశిక్ష శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఆర్‌పీ (సీనియర్ రీసోర్స్ పర్సన్)కు మూడు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఎస్‌ఆర్‌పీలను శిక్షణకు ఎంపిక చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ఏలూరు జిల్లాలో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే రెసిడెన్షియల్ శిక్షణకు హాజరు కావాలని ఆదేశించారు. అదే విధంగా అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణిత, సైన్స్ టీచర్లకు ఎక్స్‌పోజర్ విజిట్‌ను నిర్వహించనున్నారు. ఈ విజిట్ ఈనెల 26వ తేదీ నుంచి జూన్ 11 వ తేదీ వరకు అయిదు విడతల్లో చేపట్టనున్నారు. ఇందుకు జిల్లాలో ఎంపిక చేసిన టీచర్ల జాబితాను జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి పంపారు. ఆ జాబితాలో ఎంపిక చేసిన టీచర్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మామిడీలా!



చిత్తూరులో మార్కెట్‌లో ఎగుమతికి సిద్ధమవుతున్న కాయలు

మామిడి ధరలు ఆరంభంలోనే అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. చెంతనే పండ్ల గుజ్జు పరిశ్రమలు ఉన్నా ఆదుకోలేకపోతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన మామిడి పండ్లకు ధరలు రోజురోజుకు పతనమవుతుండడం ఆవేదనకు గురిచేస్తోంది. పరిశ్రమలు పక్క రాష్ట్రాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేస్తుండడంతో జిల్లాలో పండించే మామిడికి గిట్టుబాటు ధర లేకుండా పోయింది. కాపుదశ ఆలస్యంగా జిల్లాలో ప్రారంభం కావడంతో పక్క జిల్లాల నుంచి మార్కెట్‌కు పండ్లు పోటెత్తుతున్నాయి. ధరలు లేకపోవడంతో ప్రస్తుతం తోటల్లోనే కాయలను వదిలేసే పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

- పడిపోయిన ధరలు
- ధరలు పోతాయని జోరుగా మామిడి కోతలు
- బేనీషా, చందూర రకం పండ్ల ధరలు పతనం
- టేబుల్ రకాలను అడిగేవారు కరవు
- తోతాపురి కొనుగోళ్లు నిల్
- రైతుల్లో గుబులు
- పట్టించుకోని ప్రభుత్వం

కాణిపాకం : మామిడి రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఫలరాజును ఏటా ధరలు కుంగదీస్తున్నాయి. ఆరంభంలోనే ఈసారి మామిడి ధరలు రైతులను ఢీలాకు గురిచేస్తున్నాయి. గిట్టుబాటు కానీ ధరతో రైతుల చేతికి నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. రెండు రోజుల్లో టేబుల్ రకానికి డిమాండ్ పూర్తిగా పడిపోయింది. అడిగేవారు లేకపోవడంతో ధరలు పతానికి చేరుకున్నాయి. కోత కోసి మార్కెట్‌కు కాయలను తెస్తే... ధరలు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. దీంతో మామిడి రైతుల్లో గుబులు పుట్టుకుంది.



మార్కెట్‌లోని మామిడి కాయలు

టేబుల్ రకాలు.. ధరలు నేలచూపు

జిల్లాలో 56 వేల హెక్టార్లల్లో మామిడి సాగవుతోంది. ఇందులో తోతాపురి 39,895 హెక్టార్లు, నీలం 5,818 హెక్టార్లు, అల్ఫోన్సో 3,127 హెక్టార్లు, బేనీషా 3,895, మల్లిక 1,740 హెక్టార్లు, ఇతర రకాలు 1,526 హెక్టార్లల్లో సాగువుతున్నాయి. ప్రస్తుతం వీటిలో టేబుల్ రకాలను మాత్రమే రైతులు కోతకు పెట్టారు. ఈసారి గంగజాతర తర్వాత నుంచి టేబుల్ రకాలను జోరుగా కోతకోస్తున్నారు. రైతులకు అందుబాటులో ఉండే చిత్తూరు, పలమనేరు, దామలచెరువు ఇతర మార్కెట్‌కు కాయలను తరలిస్తున్నారు. అయితే ఈ కాయలకు మార్కెట్లో ధరలు పలకడం లేదు. చందూర, బేనీషాను కొనేవారు లేరని చిత్తూరు మార్కెట్లోని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. దీని దెబ్బకు వారు నాటుకాయలు, తోతాపురిపై పూర్తిగా ముఖం చాటేశారు.

ధరల పతనానికి కారణాలు

జిల్లాలో 47 పండ్ల గుజ్జు పరిశ్రమలున్నాయి. మే నెల ఆరంభం నుంచే కొన్ని ఫ్యాక్టరీలు తెరుచుకున్నాయి. కేరళ నుంచి అల్ఫోన్సో కాయలను దిగుమతి చేసుకుని గుజ్జు చేయడం ప్రారంభించాయి. ఇదే మాదిరిగానే మరికొన్ని ఫ్యాక్టరీలు తెరుచుకుని విజయవాడ నుంచి కాయలను దిగుమతి చేసుకుని గుజ్జు తయారీని వేగవంతం చేశాయి. దీని కారణంగా జిల్లా కాయలపై దెబ్బపడుతోంది. అక్కడి ధరలను తక్కువ చూపించి...ఇక్కడ కాయల ధరలను తగ్గించేస్తున్నారు. ఇక జిల్లాలో పండే టేబుల్ రకాలను చిత్తూరు మార్కెట్ నుంచి అధికంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ వ్యాపారులు కొనుగోలు చేసి వ్యాపార లావాదేవీలు నడిపిస్తున్నారు. అయితే విజయవాడ ప్రాంతంలో సీజన్ ముగింపు దశలో ఉందని...దీంతో అక్కడి నుంచి ఈ రెండు రాష్ట్రాల వ్యాపారుల వ్యాపారం పుంజుకోవడంతో ..ఇక్కడి వ్యాపారం పడిపోయినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. దీంతో పాటు అక్కడి మామిడి ధరలు తక్కువ పలకడం...ఇక్కడ వ్యాపారం మందగించిందని అంటున్నారు.

వ్యాపారులు ముందుకు రాకపోవడం

గంగ జాతర తర్వాత చిత్తూరు మ్యాంగో మార్కెట్‌లో 15 ట్రేడర్లు ప్రారంభమయ్యాయి. ఇప్పుడిప్పుడే మామిడి వ్యాపారం జోరందుకుంది. వారి వద్దకు టేబుల్ రకాలు వెతుక్కుని వస్తున్నాయి. ఆ కాయలను వారి నుంచి కొనుగోలు చేసే వ్యాపారులు తగ్గుముఖం పట్టడంతో మామిడి ధరలు పడిపోయాయి. వారానికి ముందు బేనీషా కిలో రూ.30 పలికింది, తర్వాత రూ. 27కు తగ్గింది. ఇప్పుడు కిలో ధర రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. వారానికి ముందు చందూర కిలో రూ. 11 నుంచి రూ.20 వరకు అమ్ముడుబోయింది. ఇప్పుడు కిలో రూ. 8కు కొనుగోలు జరుగుతోంది. అల్ఫోన్సో మాత్రం కిలో ధర రూ.25తో నిలకడగానే ఉంది. తోతాపురిలో టేబుల్ రకాన్ని మాత్రమే కొంటున్నామని.ఈ కాయ కిలో ధర రూ. 12 రేటు ఫిక్స్ చేశారు. సాధారణ తోతాపురి కాయలను కొనేవారు లేరంటూ రూ.4కు ఇస్తే తీసుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు.



ధర లేక మామిడి పండ్లను పారబోసిన రైతులు

చేతులెత్తేస్తున్న ట్రేడర్లు

టేబుల్ రకం కాయల ధరలు పడిపోతున్నాయని భావించి చాలా మంది రైతులు కాయలు పక్వానికి రాకముందే జోరుగా కోతలు కోస్తున్నారు. పక్వానికి రాకపోయినా కోత కోసి మార్కెట్లో అమ్మకానికి పెడుతున్నారు. ఇక ఇప్పుడు రైతులు తోతాపురి కోత కోస్తామంటే అసలే వద్దంటున్నారు. మేం కొనలేమని ముందే ట్రేడర్లు చేతులెత్తేస్తున్నారు. ధరలు లేకపోవడంతో కొంత మంది రైతులు కాయలను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. లేకుంటే ఆవులకు మేత పెడుతున్నారు.

“

అడిగేవారే లేరు..



బేనీషాను అడిగేవారు లేరు. చందూరు కూడా అంతే పరిస్థితి. ఎవరైనా కొనుగోలు చేసేందుకు వస్తే కిలో రూ.15కే ఇచ్చేస్తాం. ఆరంభంలో బేనీషా రూ. 30 పలికింది. మొన్న రూ.27 ఉండేది. ఈ రోజు అడిగే వారు లేక కుప్పలు పోసి పెట్టాం. ఈ దెబ్బకు బెంగుళూరా (తోతాపురి) కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఫ్యాక్టరీ వాళ్లు కూడా కొనే పరిస్థితుల్లో లేరు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు జరిగే వ్యాపారం డల్‌గా ఉంది.

– రత్నంరెడ్డి, వ్యాపారి–రైతు, చిత్తూరు

కలెక్టర్ చొరవ చూపాలి



మామిడి సాగుకు పెట్టే ఖర్చులు సగం కూడా రావడం లేదు. పూత నుంచి కాయ పక్వానికి వచ్చే వరకు పంటను భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నాం. ఈ పంట వస్తే రాత్రింభవళ్లు నిద్ర ఉండదు. అక్కడే కాపాలా కాస్తున్నాం. వర్షాలు, ఎండను లెక్కచేయకుండా కంటికి రెప్పలా కాపాడుతున్నాం. ఆ కష్టం మాకు దక్కడం లేదు. మార్కెట్లో ధరలు నిలకడగా ఉండేలా చూడాలి. కలెక్టర్ చొరవ చూపాలి.

– కుప్పయ్యనాయుడు, రైతు, సిద్ధంపల్లి గ్రామం, చిత్తూరు మండలం

సీఎం భద్రతలో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

శాంతిపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం సొంతింటి గృహప్రవేశం సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వం చూపరాదని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డైరెక్టర్ నాచ్కేత్ విశ్వనాథ్ పోలీసులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక కల్యాణ మండపంలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సీఎం, ఇతర వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కుప్పం–పలమనేరు జాతీయ రహదారి పక్కన కడపల్లి పంచాయతీలోని శివపురం వద్ద నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక సూచనలు చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ.. వి.కోట వైపు నుంచి వచ్చే వాహనాలను బడుగుమాకులపల్లి నుంచి విజలాపురం మీదుగా కుప్పానికి, కుప్పం వైపు నుంచి వచ్చే వాహనాలను తంజంకొట్టాలు నుంచి రాళ్లబూదుగూరు మీదుగా తుమ్మిశికి మళ్లించాలని చెప్పారు. ద్రవిడ యూనివర్శిటీ నుంచి పీఈఎస్ మీదుగా సీఎం రాకపోకలు సాగించే రూట్ మ్యాప్‌ను వివరించారు. కాగా ఎస్ఎస్‌జీ డైరెక్టర్ నాచ్కేత్ విశ్వనాథ్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి సీఎం పర్యటన మార్గాన్ని, గృహ ప్రవేశం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. బాంబు, డాగ్ స్క్వాడ్ రూట్ మ్యాప్‌లోని ప్రాంతంలో ఉన్న కల్వర్టులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

చిత్తూరు కలెక్టరేట్ : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చిత్తూరు ఆర్‌డీవో శ్రీనివాసులు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని గాంధీ సర్కిల్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ నేటి యాంత్రిక యుగంలో యోగాతో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డీఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో యోగా చాలా ముఖ్యమన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి, డీఎస్‌డీవో బాలాజీ, ఎంహెచ్‌వో లోకేష్, యోగా గురువులు నరేంద్ర, బాబు, రాజేంద్ర పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆక్రమణ దుష్ప్రచారం కాదు.. నిజమే

- కూటమినేతల ఆటకట్టించిన అటవీశాఖ అధికారులు
- ఆక్రమణదారులపై కేసు నమోదు
- ప్రజాప్రతినిధులకు తలొగ్గని అటవీశాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఆక్రమణ దుష్ప్రచారం కాదని.. నిజమేనని అటవీశాఖ అధికారులు తేల్చారు. పది రోజుల కిందట చిత్తూరు మండలం ఎగుమాసాపల్లి ప్రాంతంలో అటవీశాఖ భూమి ఆక్రమణకు గురైంది. ఈ విషయంపై టీడీపీ నేతలు, గ్రామస్తులు అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు ఆక్రమణలో భాగంగా చదును చేస్తున్న రెండు జేసీబీలను పట్టుకున్నారు. ఆ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారిని విచారించగా ఈ భూ ఆక్రమణలో...ఓ కూటమినేతే కీలకమని తేలింది. ఆక్రమిత భూమి అటవీశాఖదా...కాదా అనే తేల్చడానికి రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. ఆ సర్వేలో ఆక్రమణ భూమి అటవీశాఖ భూమిగా నిరూపితమైంది. అయితే ఈ విచారణకు బ్రేకులు వేసి జేసీబీలను అటవీశాఖ అధికారుల నుంచి విడిపించేందుకు భారీ స్థాయిలో రాజకీయం నడిచింది. ఈ ఆక్రమణ వ్యవహారంపై ఇటీవల సాక్షి దినపత్రికలో భూమేత పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఆక్రమణదారులు దుష్ప్రచారం చేస్తున్నారంటూ మీడియా ముందుకు వచ్చారు. కేసును తప్పుదారి పట్టించేందుకు కుట్రలు చేశారు. అయితే ఆ దుష్ప్రచారం అవాస్తమని..ఆక్రమణ నిజమని అటవీశాఖ అధికారులు నిరూపించారు. నలుగురు వ్యక్తులపై కేసులు పెట్టి జేసీబీలను సీజ్ చేశారు.

అటవీభూమి ఆక్రమణలో నలుగురిపై కేసు

చిత్తూరు కార్పొరేషన్ : అటవీ భూమి ఆక్రమణకు యత్నించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. శనివారం ఎఫ్ఆర్వో కార్యాలయంలో వివరాలను తెలియజేశారు. ఎగువమాసపల్లెకు చెందిన కుమార్ నాయుడు, గువ్వకల్లుకు చెందిన లీలాకర్‌రెడ్డి, జంగాపల్లెకు చెందిన జేసీబీ డ్రైవర్లు మధుబాబు, గోపిపై కేసు నమోదు చేశామన్నారు. ఇటీవల చిత్తూరు రూరల్ మండలం ఎగువమాసపల్లెలో రెండు జేసీబీల ద్వారా భూమిని చదును చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. వీటిపై సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జేసీబీలను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్లను అదుపులో తీసుకున్నామన్నారు. వారిని విచారించగా ఎగువమాసపల్లెకు కుమార్‌నాయుడు, లీలాకర్‌రెడ్డి చెప్పడంతో పనులు చేశామన్నారు. ఆ భూమి వారిదని చెప్పడంతో చదును చేయడానికి వెళ్లినట్లు చెప్పారన్నారు. తదుపరి రెవెన్యూ, అటవీ సిబ్బంది కలిసి సంయుక్తంగా సర్వే చేయగా అటవీ భూమిని తేలిందన్నారు. దాదాపు అర ఎకరంలో కలుపు మొక్కలను తొలగించినట్లు గుర్తించామన్నారు. డీఎఫ్ఓ ఆదేశాల మేరకు అటవీభూమి అన్యాక్రాంతం కింద కేసు నమోదు చేశామన్నారు. సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసినట్లు వివరించారు.

రుణాలకు ‘చంద్ర’గ్రహణం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు ఇస్తున్నాం దరఖాస్తు చేసుకోండి అంటూ ప్రభుత్వం రెండు నెలల కిందట ఆర్భాటం చేసింది. ఉపాధి రుణాలిస్తుందనే ఆశతో జిల్లాలోని నిరుద్యోగులు కుప్పలు తెప్పలుగా దరఖాస్తు చేసుకున్నారు. చివరికి ఆ రుణాలను మంజూరు చేయకుండా అభ్యర్థులకు మొండిచేయి చూపింది. ఆశావహులు దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రస్తుతం రుణాలు ఇవ్వడం లేదంటూ ప్రభుత్వం బోర్డు తిప్పేసింది. దీంతో దరఖాస్తుదారులు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.



- స్వయం ఉపాధి రుణాలకు వేల సంఖ్యలో దరఖాస్తులు
- మొదట్లో గొప్పగా ప్రచారం చేసిన కూటమి
- అణగారిన వర్గాలకు కుచ్చుటోపీ
- మంజూరు చేయలేక చేతులెత్తేసిన ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎన్ని స్వయం ఉపాధి రుణాలకు ఎన్ని లక్షలకైనా దరఖాస్తు చేసుకోండి ఇచ్చేస్తాం అంటూ కూటమి ఎమ్మెల్యేలు ఊరూరా తిరిగి దండోరా వేసినట్లు ప్రచారం చేశారు. చివరికి ఎమ్మెల్యేలు చేసిన ప్రచారమంతా బూడిదలో పోసినపన్నీరయ్యింది. స్వయం ఉపాధి రుణాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లు నోటిఫికేషన్ జారీ చేశాయి. ఆ నోటిఫికేషన్ ప్రకారం యూనిట్లను ఖరారు చేసి మంజూరు చేసే రుణాలు, రాయితీని పేర్కొన్నారు. ఆయా యూనిట్ల స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. ఈ తతంగం అంతా మార్చి, ఏప్రిల్ నెలల్లో సాగించి మసి పూసి మారేడు కాయ చందంగా మోసం చేశారు.



స్వయం ఉపాధి రుణాల ప్రచారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ చిత్రం

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

స్వయం ఉపాధి రుణాల మంజూరు ప్రక్రియలో దరఖాస్తుల స్వీకరణ వరకే ప్రభుత్వం పరిమితం అయింది. ఉపాధి రుణాలు వస్తే అభివృద్ధి చెందవచ్చనే ఆశతో జిల్లాలోని వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రక్రియ ముగిశాక రుణాలను మంజూరు చేయాల్సిన కూటమి సర్కారు చేతులెత్తేసింది. తదుపరి ప్రక్రియ ఎప్పుడు కొనసాగిస్తారు...రుణాలు ఎప్పుడిస్తారనే విషయాలను ఏ మాత్రం తెలియజేయకుండా మిన్నకుండిపోయారు. దీంతో దరఖాస్తు చేసుకున్న ఆశావహులు రుణాల కోసం నిత్యం జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొంత మంది ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయ అధికారుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇంకొంతమంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రుణాలు ఎప్పుడిస్తారంటూ అర్జీలు పెడుతున్నారు.

39,047 దరఖాస్తులు

చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో స్వయం ఉపాధి రుణాలకు 14 కార్పొరేషన్ల పరిధిలో 39,047 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో చిత్తూరు జిల్లాలో 21,504 మంది, తిరుపతి జిల్లాలో 17,543 మంది ఆయా కార్పొరేషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయా సామాజిక వర్గాలకు ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాలో కార్పొరేషన్‌ల వారీగా దరఖాస్తుల వివరాలు

కార్పొరేషన్ పేరు	చిత్తూరు జిల్లా దరఖాస్తులు	తిరుపతి జిల్లా దరఖాస్తులు
బీసీ	18175	14293
బ్రాహ్మణ	44	40
ఈబీసీ	384	281
కమ్మ	440	326
క్షత్రియ	46	78
రెడ్డి	363	351
వైశ్య	120	133
కాపు	1781	1872
ఎంఎస్ఎంఈ	24	70
బీసీ జెనరిక్	42	46
కుమ్మర, మేదర	85	53

ఎవరిని మోసం చేయడానికి..



స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తామని హంగామా చేశారు. చివరికి దరఖాస్తులు స్వీకరించి మిన్నకుండిపోయారు. ఈ తతంగం అంతా ఎవ్వరిని మోసం చేయడానికి. రుణాలు ఇవ్వలేనప్పుడు ఎందుకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రశ్నిస్తున్నాం. దళితులను మోసగిస్తే తగిన గుణపాఠం జరుగుతుంది.

– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి, చిత్తూరు జిల్లా

చిత్తశుద్ధి ఉంటే కొనసాగించాలి



ప్రభుత్వానికి ప్రజలంటే అలుసా ? స్వయం ఉపాధి రుణాలొస్తాయనే ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. చివరికి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత చేతులెత్తేయడం ఏమిటి..? సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాల మంజూరు ప్రక్రియను కొనసాగించాలి.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, చిత్తూరు జిల్లా

క్లుప్తంగా

డైట్ లెక్చరర్ల డెప్యుటేషన్‌పై ఉత్తర్వులు జారీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరంలో ఉన్న ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇటీవల పలువురు లెక్చరర్లను ఎంపిక చేసిన విషయం విదితమే. అయితే నూతనంగా డెప్యుటేషన్ ప్రాతిపదికన డైట్‌లో పనిచేసేందుకు ఎంపికైన వారి విధులు, బాధ్యతలను తెలియజేస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్

చౌడేపల్లె: అతిగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగి మద్యం మత్తులో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. ఆమినిగుంటకు చెందిన మణి కుమారుడు ఎస్.శేఖర్(27) ఆటో నడపడంతో పాటు కూలీపనులు చేసేవాడు. శనివారం కుటుంబంలో తలెత్తిన కలహాల కారణంగా తల్లి శాంతమ్మతో వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో శేఖర్‌ను కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపంతో మద్యం మత్తులో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు మదనపల్లెకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,374 మంది స్వామివారిని దర్శించుకోగా 37,477 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఇసుక ధరలకు రెక్కలు

- వర్షాలతో చెరువులు, కౌండిన్యలోకి చేరిన వరద
- మూడు నెలలు ఇసుక తోడేందుకు వీలుకాని పరిస్థితి
- ఇప్పటికే దాచుకున్న ఇసుక డంపులకు డిమాండ్
- ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.4 వేలకు పైమాటే
- సిండికేట్‌గా ఏర్పడి అమాంతం పెంచిన అక్రమార్కులు



కౌండిన్య నదికి ఆనుకొని రహస్య ప్రదేశంలో ఇసుక డంపు (ఫైల్)

పలమనేరు : పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో కూటమి పేరు చెప్పుకొని కొందరు ఇసుకాసురులు కౌండిన్య నదిలోని ఇసుకను భారీగా తరలించి రహస్య ప్రదేశాల్లో దాచుకున్నారు. వారం రోజులుగా స్థానికంగా కురిసిన భారీ వర్షాలతో పలు చెరువులు , నదిలోకి వరద నీరు చేరడంతో మరో మూడు నెలల దాకా ఇసుక తరలించేందుకు వీలు కాని పరిస్థితి ఏర్పడింది. ఇసుకాసురుల తవ్వకాలకు వరుణుడే అడ్డుకట్ట వేశాడు. దీంతో నదిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. కానీ గతంలో డంప్ చేసిన ఇసుకను ఇప్పుడు ఇసుకాసురులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2,500 ఉండగా ఇప్పుడు రూ.4 వేలకు చేరింది. మరో పది రోజుల తర్వాత ఈ ధర రూ.5 వేలు దాటడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో డంపులు పెట్టుకున్న ఇసుకాసురుల పంట పండనుంది.



కౌండిన్య నదిలోకి చేరిన వర్షపు నీరు

దొరికనంత దోచేశారు..

వర్షాలొస్తే ఇసుక దొరకదేమోనని ఏడాదిగా కౌండిన్య నది, చెరువుల్లో నిత్యం ఇసుకు తోడిన అక్రమార్కులు భారీగా రహస్య ప్రదేశాల్లో డంపులకు చేర్చుకున్నారు. ముందుగా నదిలోని ఇసుకను దొరికినంత దోచుకోవడం కోసం ఒకరిమీద మరొకరు పోటీలు పడి మరీ ఇసుకను పోగేసుకున్నారు. కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో కొందరు కూటమి పేరు చెప్పుకొని అప్పులు చేసి మరీ ట్రాక్టర్లు, జేసీబీలను తెచ్చి ఇసుకను తోడేశారు.

నిల్వ చేసుకున్న గ్రామాలు ఇలా..

నియోజకవర్గంలోని గంగవరం మండలంలో కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న జీడిమాకులపల్లి, బైపాస్ రోడ్డు, క్యాటిల్‌ఫామ్, రామాపురం పొలాలు, మారేడుపల్లి, ముబ్బువాళ్లపేట, పలమనేరు మండలంలోని మొరం, కూర్మాయి, జల్లిపేట, మొసలిమడుగు, సముద్రపల్లి, కూర్మాయి, జంగాళపల్లి, తావడపల్లి, వడ్డూరు, పెద్దపంజాణి మండలాల్లోని 20 దాకా గ్రామాల్లో భారీగా ఇసుక డంపులున్నాయి.

సిండికేట్‌గా ఏర్పడి అమాంతం ధరలు పెంచి..

వర్షాల కారణంగా ఇసుకకు డిమాండ్ వచ్చిపడింది. దీంతో ఇప్పటికే దాచుకున్న ఇసుకాసురులు సిండికేట్‌గా ఏర్పడి ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల దాకా పెంచేశారు. త్వరలో ఇది రూ.5 వేలు దాటడం ఖాయం . గతంలో కర్ణాటకలోని హోసకోట్ వ్యాపారులకైతే ఇక్కడ టిప్పర్ రూ.28 వేల దాకా అమ్మేవారు. ఇప్పుడు టిప్పర్ ధర రూ. 40 వేలకు చేరింది. సంబంధిత శాఖలైన మైనింగ్, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల అధికారులు రహస్య డంపులను సీజ్ చేయాల్సిన అవసరం ఉంది. వీటిని అధికారుల ద్వారా సామాన్యులకు అందుబాటు ధరలతో విక్రయించినా ప్రభుత్వానికి ఆదాయం దక్కుతుందనే మాట స్థానికంగా వినిపిస్తోంది.

సీజ్ చేసి తక్కువ ధరకు అందించాలి



పలమనేరు ప్రాంతంలో కౌండిన్య నదిని ఆనుకుని ఇన్నాళ్లు ఇసుకను తోడిన కూటమి ఇసుకాసురులెవరు? వారెక్కడ ఇసుకను డంపు చేశారో అధికారులకు తెలియందేమీ కాదు. దీని కోసం దాడులు అవసరంలేదు. వారికే తెలుసు కాబట్టి దాన్ని సీజ్ చర్యలు తీసుకోవాలి. సీజ్ చేసిన ఇసుకను అవసరమైన వారికి తక్కువ ధరతో అందుబాటులోకి తీసుకురావాలి.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

ఇసుక తవ్వకాలను ప్రకృతే అడ్డుకుంది




మండలంలోని కౌండిన్యతో పాటు పలు చెరువుల్లో కూటమి నాయకులు ఇన్నాళ్లు ఇసుక, మట్టిని కొల్లగొట్టేశారు.ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రకృతే వర్షాన్ని కురిపించి వాగులు, వంకలు పొర్లి చెరువుల్లోకి నీరు చేరింది. దీంతో ఇసుక తవ్వకాలకు ఆ వరుణుడే బ్రేక్ వేశాడు.

– నరసింహారెడ్డి, వైస్ సర్పంచ్, కొలమాసనపల్లి

పుంగనూరు 6 మండలాల బదిలీ నోటిఫికేషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాల బదిలీకి సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రచురించారు. ఈ మేరకు ఆ నోటిఫికేషన్ ను కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని ఆర్డీవో, అన్ని మండల కార్యాలయాలకు పంపారు. ప్రచురించిన ప్రాథమిక నోటిఫికేషన్ ను అన్ని కార్యాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో పెట్టాలన్నారు. ప్రచురించిన ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం.....

- చిత్తూరు జిల్లాలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.
- చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజన్ నుంచి పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుంచి రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు బదలాయించనున్నారు.
- మండలాల బదిలీ పై అభ్యంతరాలు, సూచనలను ఇంగ్లీషు, తెలుగులో లిఖిత ర్వకంగా రాసి చిత్తూరు కలెక్టరేట్‌లో 30 రోజుల లోపు ఇవ్వాలని పేర్కొన్నారు.



కలెక్టర్ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ పత్రాలు

గజరాజుపై వేణుగోపాలుడు

కార్వేటినగరం : కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం రాత్రి గజవాహనం , ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం స్వామివారిని మాడ వీధులో ఊరేగించారు. అదే విధంగా సాయంత్రం ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను ఆకట్టుకుంది. రాత్రి 7 గంటలకు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువు దీర్చారు. అనంతరం గజవాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణబట్టర్ తరుణ్‌కుమార్, వేద పండుతులు నారాయణ దాసరి, గోపాలాచారి, శభరీష్, రమేష్, ధన్వంతరి తదితరులు పాల్గొన్నారు.





హనుమంత వాహనంపై ఊరేగిన మాధవుడు, ఆకట్టుకుంటున్న కోలాట ప్రదర్శన

కందిపప్పు దూరం

- రేషన్ షాపుల్లో ఇవ్వని పప్పు
- బియ్యం, పంచదారకే పరిమితం
- మార్కెట్‌లో చుక్కలంటుతున్న ధరలు
- ఆవేదన చెందుతున్న కార్డుదారులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పేదలకు కందిపప్పు కరవుతోంది. చౌక దుకాణాల్లో రాయితీ ద్వారా అందించే పప్పునకు ప్రభుత్వం మంగళం పాడింది. అయిదు నెలల కిందట పప్పు పంపిణీని నిలుపుదల చేసింది. తద్వారా పేదలు కందిపప్పునకు దూరమయ్యారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర మోత మోగిపోతోంది. పేదలు మార్కెట్‌లో కొనలేని పరిస్థితి దాపురించింది. జనవరి నుంచి ఇప్పటి వరకు చౌకదుకాణాల్లో కందిపప్పు ఊసేలేదు. ఎండీయూ వాహనాలను రద్దు చేసినంత వేగంగా కందిపప్పు సరఫరాను ప్రభుత్వం ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదని నిలదీస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆ శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు చిరు ధాన్యాలు కూడా ఇస్తామని చెప్పారని.. నాలుగైదు మాసాలుగా కంది పప్పునకే దిక్కులేదని అపహాస్యం చేస్తున్నారు. రేషన్ కార్డు దారులకు ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా అందించే నిత్యావసర సరుకులు అంతంత మాత్రమే అందుతున్నాయని కార్డుదారులు వాపోతున్నారు.

పేదల అవస్థలు

బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రూ.200 వరకు పలుకుతోంది. ప్రభుత్వ చౌక ధరల దుకాణం ద్వారా కార్డుదారులకు రూ.67కు విక్రయించేవారు. ఈ ధరకు సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా లేకపోవడంతో సామాన్య ప్రజలు బయట మార్కెట్లో పెరిగిన ధరతో కందిపప్పును కొనేందుకు ఆర్థి క ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 5.40 లక్షల రేషన్ కార్డులు, 1339 రేషన్ షాపులు న్నాయి. వీరందరి కోసం ప్రతినెలా 9 వేల మె ట్రిక్ టన్నుల బియ్యం, 543 మెట్రిక్ టన్నులు కందిపప్పు, 350 మెట్రిక్ టన్నుల చక్కెర అవసరమవుతోంది. గత ఐదు నెలల నుంచి బియ్యం, అర కిలో పంచదార మాత్రమే చౌక దుకాణాల ద్వారా సరఫరా అవుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

సామాన్య ప్రజలు నిత్యవసర సరుకులు బయట మార్కెట్లో కొనలేక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బియ్యం, చక్కెర, రాగులు, రాగిపిండి, గోధుమపిండి, ఇతర నిత్యావసర సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా తక్కువ ధరకు ప్రభుత్వం సరఫరా చేసింది. రాను రాను చౌక ధరల దుకాణాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. జనవరి నెల ముందు వరకు చౌక ధరల దుకాణాలలో కందిపప్పు, బియ్యం, అర కిలో పంచదార సరఫరా అయ్యేవి. ప్రస్తుతం కంది పప్పును అయిదు నెలలుగా అందించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

పునరుద్ధరించాలి

ప్రస్తుతం నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పు దినుసు ధరలు కిలో రూ. 100 దాటింది. నూనె ధర రూ.150 పలుకుతోంది. ఇతర వస్తువుల ధరలు అమాంతం పెరగడంతో పేదలు నిత్యావసర సరుకులను కొనలేని పరిస్థితుల్లో ఉ న్నారు. నిరుపేదలకు అవసరమైన నిత్యవసర వస్తువులైన పంచదార, నూనె, చింతపండు, ఉల్లిపాయలు, చిరుధాన్యాలు, ఉప్పు, కారం, ఇతర వస్తువులను తక్కువ ధరకు అందించాలని కార్డుదారులు కోరు తున్నారు. చౌక ధరల దుకాణాల్లో నిలిపివేసిన కందిపప్పును తిరిగీ పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీల సందడి

బదిలీల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి జిల్లా కేంద్రంలోని ఏ ప్రభుత్వ శాఖలో చూసినా బదిలీల కసరత్తే సాగుతోంది. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మేరకు అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు కసరత్తును పకడ్బందీగా సాగిస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మరో 9 రోజులే గడువు ఉండటంతో వేగవంతంగా ప్రక్రియ కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆయా శాఖల అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

- ఏ శాఖలో చూసినా బదిలీల కసరత్తే..
- దరఖాస్తుకు మరో 9 రోజులే గడువు
- అన్ని శాఖల ఉద్యోగులు కదలాల్సిందే
- ఉమ్మడి చిత్తూరు ప్రాతిపదికన ప్రక్రియ
- జూన్ 3 నుంచి బదిలీలపై నిషేధం



చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీల సందడి నెలకొంది. ఈ బదిలీల ప్రక్రియలో ఆయా శాఖల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులు కచ్చితంగా కదలాల్సి వస్తోంది. బదిలీల ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. బదిలీలు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తుండటంతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల అధికారుల సమన్వయంతో ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అన్ని శాఖల్లో వచ్చే నెల 2వతేదీ లోపు ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

అయిదేళ్లు పూర్తయితే కదలాల్సిందే...

జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖల్లో అయిదేళ్లు పూర్తయిన ఉద్యోగులు తప్పనిసరిగా కదలాల్సిందేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2025 మే 31వ తేదీ నాటికి ఒకే స్థానంలో అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు కచ్చితంగా ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అనారోగ్య సమస్యలున్న వారికి ప్రాధాన్యం

ప్రస్తుత బదిలీల్లో అనారోగ్యంతో బాధపడే వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులు, మానసిక దివ్యాంగ పిల్లలు ఉండి వైద్య వసతి కలిగిన ప్రదేశాలకు వెళ్లే వారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పించనున్నారు. 40 శాతంపైగా అంగ వైకల్యం కలిగిన వారు, దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ తదితర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన వితంతు ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దివ్యాంగ ఉద్యోగులు కోరుకుంటే తప్ప వారిని బదిలీ చేయకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయా శాఖల్లో అలాంటి ఉద్యోగులు ఉన్నట్లెతై వారు కోరిన చోట ఖాళీలను బట్టి బదిలీ చేసేలా వెసులుబాటును కల్పించారు. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరినీ ఒకేచోట ఉంచేందుకు.. వీలు కాకపోతే పక్క ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని సూచించింది. ఉద్యోగోన్నతి పొందిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని, ఆ పోస్టు ఇతర ప్రాంతాల్లో లేకపోతే అదేస్థానంలో కొనసాగించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది.

18 వేల దాకా ఉద్యోగులు

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఆయా శాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. జిల్లా, జోనల్, మల్టీజోనల్ కేడర్ ఉద్యోగుల బదిలీలను ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకొని చేపడుతున్నారు. జిల్లాలోని 98 శాఖల్లో దాదాపు 12 వేల నుంచి 18 వేల వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేకుండా సకాలంలో సంబంధిత శాఖలు ప్రక్రియను నిర్వహించేలా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఫిర్యాదులు వస్తే అధికారులే బాధ్యత

బదిలీల్లో ఏవైనా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఆయా శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్ , మండల స్థాయి ఉద్యోగ సంఘాల్లో పని చేస్తున్న వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు టర్మ్‌లు కానీ, తొమ్మిదేళ్ల సర్వీసు కానీ ఒకేచోట పూర్తి చేసి ఉంటే తప్పనిసరిగా బదిలీ చేస్తారు. తాలూకా, జిల్లా స్థాయి గుర్తింపుపొందిన ఉద్యోగుల అసోసియేషన్స్ ఆఫీసర్ బేరర్స్ జాబితాను కలెక్టర్ ద్వారా ఆయా శాఖల అధికారులకు పంపేలా చర్యలు చేపట్టారు. వచ్చేనెల 3 నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొనడంతో ఆ లోపు ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు కసరత్తు వేగవంతంగా చేపడుతున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కళ్యాణి

పుత్తూరు : బైక్‌పై వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును మరో బైక్‌పై వచ్చిన దుండగుడు లాక్కొని పరారైన సంఘటన శనివారం రాత్రి పుత్తూరులో చోటు చేసుకుంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు.. తిరుపతికి చెందిన కళ్యాణి(55) పుత్తూరులో వ్యవసాయ మోటార్ల షాపును నిర్వహిస్తున్నారు. యథావిధిగా రాత్రి 8 గంటలకు షాపును మూసివేసిన కళ్యాణి, తమ్ముడు శ్రీరామ్‌తో కలసి తిరుపతికి బైక్‌పై బయలుదేరారు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు కళ్యాణి మెడలోని రెండున్నర సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనలో కిందపడ్డ కళ్యాణికి తల వెనక భాగంలో, మెడపైనా రక్తగాయాలయ్యాయి. గాయపడ్డ మహిళను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.